# మానవ వికాస వేదిక 3వ రాష్ట్ర మహాసభలు

**2010 డిసెంబర్ 25, 26 తేదీలు. హ్యూమనిస్ట్ సెంటర్, బాటసింగారం, రంగారెడ్డి జిల్లా.**

## కార్యదర్శి నివేదిక

తేదీ: 26-12-2010.

మానవ వికాస వేదిక సభ్యులారా! శ్రేయోభిలాషులారా!

మన రాష్ట్రరాజధాని, హైదరాబాద్ మహానగర పరిధిలో, మానవవాద విస్తృతికోసం ఏర్పాటయిన తొలి మానవవాద కేంద్రం (హ్యూమనిస్ట్ సెంటర్)లో తొలి కార్యక్రమంగా, మానవ వికాస వేదిక 3వ రాష్ట్ర మహాసభలు మనం జరుపుకుంటున్నందుకు చాలా సంతోషంగావుంది. ఇటువంటి సంతోషాన్ని, అవకాశాన్ని కల్పించిన మానవవాద మహిళా ఉద్యమనేత మల్లాది సుబ్బమ్మగారికి ఈ సందర్భంగా మన సంస్థ తరుపున ధన్యవాదాలు తెలపుతున్నాను.

మానవ జీవితాన్ని సుఖమయం చేయటానికి మానవవాదమే ఏకైక శరణ్యమని ప్రపంచమంతా భావించేస్థితి క్రమంగా పెరుగుతున్నది. మానవ పరిణామక్రమంలో, జంతుదశ నుంచి సంక్రమించిన అనాగరికత, అజ్ఞానం, అసూయ, ద్వేషం, హింసా క్రౌర్యాల వంటి అమానవీయ విలువలతో ఏర్పడిన మతం క్రమక్రమంగా పలుదేశాల్లో బలహీన పడుతోంది. పవిత్రగ్రంథాల పేర, ఆ గ్రంథాల్లో వర్ణించిన దైవాల పేర మనుషుల బుద్ధిని భయంతోను, భక్తితోను, స్వార్థ, సంకుచితత్వాలతోనూ కలుషితం చేసిన మతం ఇపుడు అమెరికా, ఐరోపా దేశాల్లో చావుదెబ్బలు తింటోంది. మనుగడకోసం ఆఫ్రికా, ఆసియాల్లోని పేద దేశాలవైపు పరుగులిడుతూ ఇంకా విజ్ఞానపు వెలుగులు ప్రసరించని అమాయక జనాల్ని ఆశ్రయిస్తున్నది.

కాగా, మనముంటున్న భారతదేశ పరిస్థితి ఇందుకు భిన్నంగావుంది. వేల సంవత్సరాల నాటి బ్రాహ్మణీయ భావజాలపు హిందూమతం కాలానుగుణంగా రంగులు మార్చుతూ, ఆధునిక విజ్ఞానాన్ని సైతం ఆరంగుల్లో ముంచుతూ అజ్ఞానపు విజ్ఞానాన్ని విరజిమ్ముతోంది. సైన్సు, సాంకేతిక పరిజ్ఞానాలు ఎంత అందుబాటులోకి వచ్చినా, ఏది అజ్ఞానమో, ఏది విజ్ఞానమో తేల్చుకోలేని విధంగా ప్రజల్ని భయభక్తుల్లో ముంచి ఆలోచనాస్వేచ్ఛను అందకుండా చేస్తోంది. ఈ వింతపోకడల్ని విదేశాలకు సైతం సరఫరా చేస్తూ 'ప్రపంచీకరణ'కు పాల్పడుతోంది. ఇక్కడి ఇస్లాం, క్రైస్తవాలు సైతం అదే వింత పోకడల్ని అనుసరిస్తూ తమతమ మతానుయాయులకు భ్రమాపూరిత జీవిత చిత్రాల్ని ప్రదర్శిస్తున్నాయి. మధ్యయుగాలనాటి ఆచారాలకు, ఆలోచనలకు ఆధునిక అర్థాలు చెపుతూ తమ పట్టునుంచి జారకుండా పట్టివుంచుతున్నాయి. 'ప్రపంచ మతాల ప్రయోగశాల'గా వున్న భారతీయ సమాజంలో ఏర్పడివున్నంత ఆధ్యాత్మిక జీవన సంక్లిష్టత మరేదేశంలోనూ మనకు కన్పించదు.

ఇటువంటి సమాజంలో మానవవాద భావాలను మొలకెత్తింప చేయటం అంత తేలికకాదు. కులపరమైన హక్కులవలలో చిక్కుకొని పరస్పరం కలహించుకునేచోట మానవ హక్కులను గుర్తుచేస్తూ మాట్లాడటం చిన్న విషయం కాదు. అవినీతే ఒక జీవన విలువగా, అక్రమార్జనే ఒక హోదాగా, అసమానతే ఒక ఉత్తమ సామాజిక స్థాయిగా గౌరవింపబడే చోట, ప్రజాస్వామిక విలువల్ని ప్రచారం చేయటం సుసాధ్య విషయం కాదు. పాతరబద్ద పాత నమ్మకాలు సైతం కొత్త సింగారాలతో కులుకుతూ పైకి లేస్తున్న ఈ సమయంలో శాస్త్రీయ స్పృహ గురించి ప్రచారం చేయటం పూలబాటపై నడక కాదు. రంగుగుడ్డల దీక్షల్లోను, రంకు బొంకుల బాబాల, స్వాముల, మాతల అవతారమూర్తుల కపట వేషాల్లోను, తమ బతుకు సమస్యలకు పరిష్కారాలకోసం జరిపే వెతుకులాటలో రోజు రోజు భంగపడుతూ కూడా, ఆ మత్తునుంచి బయట పడలేని దీనజనావళిని మేల్కొల్పటం నీళ్ళు తాగినంత సులభంకాదు.

అయినా సరే, కష్టసాధ్యమనిపించినా సరే, మనం ఆ పనికి పూనుకొన్నాం. మానవ వికాస వేదికను ఏర్పరచుకున్నాం. ఆశయాలపై ఆశవుంచుతూ, మొక్కవోని పట్టుదలతో శక్తివంచన లేకుండా మనం చేయదగినంత చేస్తూ ముందుకు పోతున్నాం. 2004 సెప్టెంబర్ 12న మా.వి.వే. ను స్థాపించికొని , 2005 జనవరి 11, 12 తేదీల్లో హైదరాబాదులో తొలిమహాసభను, 2008 జనవరి 12, 13 తేదీల్లో మలి మహాసభను కరీంనగర్ జిల్లా, గోదావరిఖనిలో జరుపుకున్నాం. ఈ అయిదేళ్లలో మనం చేసిందెంత, సాధించిందెంత అని చూసుకుంటూ మనకేమీ కన్పించకపోవచ్చు. కానీ, మన భావాల ప్రచారాలు, మన కార్యాల ప్రభావాలు జనం మెదళ్ళలో భావవిప్లవ విత్తనాలుగా మొలకెత్తున్నాయి. వారి జీవితాల్లో ఎంతో కొంత వివేకాన్ని పండిస్తున్నాయి. దాని దిగుబడి పెంచాలంటే మనం మరింతగా కృషి చేయాల్సివుంది.

2008 జనవరి నుంచి మానవ వికాస వేదిక చేసిన మూడేళ్ళ కృషిని ఇపుడు మీ ముందుంచుతున్నాను.

## 2008 జనవరి నుంచి 2010 డిసెంబర్ వరకు మా.వి.వే. కార్యక్రమాలు

### 2008 సంవత్సరంలో

1. **21-3-2008** : హైదరాబాదులోని జ.వి.వే. కార్యాలయంలో హేమలతా లవణం సంస్మరణ సభ. కె.వి.ఆర్. అధ్యక్షత. ఎన్.ఇన్నయ్య, కె.రామచంద్రమూర్తి, సి.ఎల్.ఎన్.గాంధీ, బి.సాంబశివరావు, చందనాచక్రవర్తి మొదలగువారు వక్తలు.
2. **26-3-2008** : రంగారెడ్డి జిల్లా ఘటకేసర్‌లో జిల్లా కోశాధికారి నోముల శంకర్‌దేవ్ మృతి సందర్భంగా సంస్మరణ సభ. పి.అనంతరామయ్య అధ్యక్షత. బి.సాంబశివరావుతోపాటు స్థానిక బి.జె.పి.. టి.డి.పి. నాయకులు వక్తలు.
3. **11-5-2008** : వరంగల్ జిల్లా శాఖ నిర్వహణలో 'మానవవాద ఆవశ్యకత'పై అవగాహనా సదస్సు. బి.సుధాకర్ అధ్యక్షత. టి.రాములు, బి.సాంబశివరావు వక్తలు.